# భారతీయ చిత్ర లేఖనం..!

కేరళ చిత్రకళకు సంబంధించి తిరువాంచికులమ్ పల్లమణ్ణ, త్రిపియేర్, వడక్కునాధ మొదలైన దేవాలయాలలో చిత్రలేఖ నాలున్నాయి. అదేవిధంగా కేరళలోని పద్మనాభపురం, కృష్ణాపురం రాజ భవనాలలో చిత్ర కళ విశేష ప్రాముఖ్యతను సంతరిం చుకుంది. పురాణాలు, రామాయణ, మహా భారతంలోని అంశాలను కథా వస్తువులుగా చిత్రించారు.

### పాల రాజుల చిత్రకళ (బీహార్-బెంగాల్) :

బీహార్-బెంగాల్‌లో పాల రాజులు(క్రీ.శ. 9 నుంచి 16 వరకు) గొప్ప శిల్పాలను అందించారు. ఆ శిల్పాల సంప్రదాయ రీతిలోనే చిత్రకళను కూడా ప్రోత్సహించారు. వీరి కాలంలో తాటాకు గ్రంథాలపై చిత్రాలు గీశారు. అదేవిధంగా పుస్తకాలు ఉంచే పెట్టెలపై చిత్రాలు వేశారు. పాల స్కూలు అనే పుస్తకాల పేజీలలో అనేక చిత్రాలను అత్యంత సుందరంగా మలిచారు. ఈ పుస్తకాలు ఎక్కువగా బౌద్ధులకు సంబంధించినవి. వీటిలో ప్రజ్ఞా పారమిత, గండవ్యూనహ సాధనమాల ముఖ్యమైనవి. ప్రజ్ఞాపా రమిత్ర గ్రంథం మహీపాల చక్రవర్తి కాలంలో రూపొందించారు.

### జైనకల్ప సూత్రాలు- చిత్రలేఖనం (క్రీ.శ. 11 నుంచి 15 శతాబ్దం వరకు):

పశ్చిమ భారతదేశంలో ముఖ్యంగా గుజరాత్‌లో తాళపత్ర గ్రంథాలు, పేపరు గ్రంథాలకు బంగారం, వెండిలను అద్ది, చిత్రాలను రూపొందించారు. ఉత్తరప్రదేశ్‌లోని మదనుపూర్ విష్ణు దేవాలయంలో జైన చిత్రాలు చిత్రించిన రాతప్రతులు లభించాయి. అవి: కల్పసూత్ర, 'సిద్ధ హేమల గుహ వృత్తి', కుమారపాల చరిత్ర, 'కలకాచార్య కథ' ముఖ్యమైనవి. పశ్చిమ భారతదేశంలో అతి ప్రాచీనమైన తాళపత్ర గ్రంథాలు క్రీ.శ.11వ శతాబ్దానికి చెందినవి. తర్వాత వివిధ కాగిత రాతప్రతులు కూడా లభ్యమయ్యాయి. 'వసంత విలాసా' బాలగోపాలస్తుతి, సాలిభద్ర చరిత్ర వంటివి. ఈ రాతప్రతులలోని లఘు చిత్రాలు నేపాల్, బెంగాల్, ఒరిస్సా ప్రాంతాలలో లభించాయి.

### మొగల్ చిత్ర లేఖనం :

క్రీ.శ. 15వ శతాబ్దంలో మొగల్ పాలకులు.. వారి స్వదేశమైన పర్షియా ప్రభావంతో కాగితంపై చిత్రలేఖనం చేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆ చిత్రకళను లఘు చిత్రకళ అని అంటారు. ఇది భారతదేశం అంతటా వ్యాపించింది. 16, 17వ శతాబ్దాలలో మొగల్ చక్రవర్తుల పోషణలో అత్యంత రమణీయమైన చిత్రకళ వర్ధిల్లింది. బాబరు భారతదేశం పైకి దండెత్తినపుడు తనతో పాటు తైమూరుకు చెందిన వర్ణ చిత్రాలను తీసుకొని వచ్చాడు. మొగలాయి చిత్రకళలో పర్షియా, పాశ్చాత్య, భారతీయ పోకడలు కనిపిస్తాయి.ఈ మూడు ప్రక్రియలు కలిసి ఉండటాన్ని



మొగలు లఘుచిత్ర కళా సంప్రదాయమని చరిత్రకారులు పేరు పెట్టారు. బాబరు కుమారుడు హుమాయన్ కళల పట్ల ఆసక్తి చూపేవాడు. హుమాయన్‌ను షేర్‌షా సూరి ఓడించడంతో... అతను కొంతకాలం పర్షియా దేశంలో తలదాచు కోవలసి వచ్చింది. అక్కడ తీరిక సమయాల్లో చిత్రకారులతో కాలక్షేపం చేసేవాడు. హుమాయన్ తిరిగి భారతదేశం వచ్చేటప్పుడు మీర్ సయ్యద్ అలీ, క్వాజా అబ్దుల్‌సమద్ అనే పారశీక చిత్రకారులను తనతోపాటు తీసుకువచ్చాడు. ఈ ఇద్దరు చిత్రకారులు మొగల్ చిత్రకళా సంప్రదాయానికి పునాదులు వేశారు. హుమాయన్ మరణం తర్వాత అక్బర్ సింహాసానాన్ని అధిష్టించాడు. అక్బర్ సంగీత సాహిత్యాలను బాగా పోషించాడు. ఫతేపూర్ సిక్రీలో చిత్రకారుల వర్క్ షాపులను నెలకొల్పి, సుమారు వందమంది చిత్రకారులను పోషించాడు. అక్బర్ కాలంలో మనోహర్, దస్వంత్, ఫరూక్ చెల్లా, బసవన్, ముకుంద్, మద్దు, హర్బన్స్, భేమ్‌కరన్ తదితర భారతీయచిత్రకారులుండేవారు. ఈ కాలంలో వీరు తమ చిత్రాల మీద పేర్లను రాసుకునేవారు.

అంత కుముందు కాలంలో చిత్రకళలో సంతకాలు పెట్టే ఆనవాయితీ లేదు. చిత్రాల మీద సంతకాలు చేసే అలవాటు చేసినందువల్ల నేడు మనకు దాదాపు వందమంది మొగలు చిత్రకారుల పేర్లు తెలుస్తున్నాయి. అక్బర్ కాలంలో పర్షియా దేశ లావణ్యం... భారతీయుల రంగుల మేళవింపుతో లఘు చిత్రకళ, ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ఇతని కాలంలోనే మీనియేచర్ ఆర్టు, బుక్ ఇలస్ట్రేషన్స్ కళలు అభివృద్ధి చెందాయి. బాబర్‌నామా, అక్బర్‌నామా, హమ్జానామా, రజ్మ్‌నామా, అన్వర్-ఇ-సుహేలి మొదలైన ప్రసిద్ధ గ్రంథాలను చిత్ర రూపంలోకి మార్చడం అక్బర్ కాలం నాటి చిత్రకళా ప్రగతికి నిదర్శనం. అక్బర్ తర్వాత 1605లో రాజ్యానికొచ్చిన జహంగీర్ కాలంలో... మొగల్ చిత్రకళ మరింత ఉన్నత స్థితికి చేరింది. జహంగీర్ స్వయంగా చిత్రకారుడు. ఇతని కాలంలో కూడా విదేశాల నుంచి చిత్రకారులను రప్పించారు. మధ్య ఆసియా నుంచి ఫరూక్ బేగ్, పర్షియా నుంచి ఆకారజా అబ్దుల్ హసన్, ఉస్తాద్ మన్సూర్, బిషన్‌దాసులు ఈ కాలం చిత్రకారులే! ఇతడు పోషించిన భారతీయ-విదేశీ చిత్రకారులు... మొక్కలు, పూలు, జంతు వులు, పక్షులు, ప్రకృతి దృశ్యాలను భారతీయతను సంతరించు కునే విధంగా మొగల్ చిత్రకళ అభివృద్ధి

చెందింది. జహంగీర్ కాలంలో మూర్తి చిత్రాలు (portraits) అధికంగా వచ్చాయి. ప్రకృతిలోని జీబ్రా, టర్కీ కోడి, డేగల చిత్రాలను అద్భుతంగా చిత్రించారు.

### షాజహాన్- మూర్తి చిత్రణ:

క్రీ.శ. 1627 సింహాసనానికి వచ్చిన షాజహాన్ తాజ్‌మహల్, ఎర్రకోట, జామామసీదు వంటి గొప్ప కట్టడాలను నిర్మించ డానికే ప్రాముఖ్యత నిచ్చాడు. చిత్రకళ అంతగా అభివృద్ధి చెంద లేదు. షాజహాన్ కాలంలో పుస్తక చిత్రణ, మూర్తి చిత్రణ, ప్రకృతి చిత్రణలు కొన్ని జరిగాయి. ఈ కాలంలో మొగలు చిత్రకళ వాస్తవికత నుంచి అలంకృత వైపు మళ్లింది. పుస్తక పేజీల చిత్రాలలో బంగారం పూతతో చిత్రాలు వేశారు. చిత్రకళలో డాంభికత ప్రతిబింబించింది. ఔరంగజేబు చిత్రకళను ఆదరించడం ఇస్లాం మతానికి విరుద్ధమని భావించాడు. ఇతని కాలంలోనే చిత్రకారులంతా దేశంలోని వివిధ ప్రాంతాలకు వలస వెళ్లారు. లక్నో, గోల్కొండ, అమృత్‌సర్, ముషిరాబాద్ ప్రాంతాలకు చిత్రకారులు వలస వెళ్లి, ప్రాంతీయ చిత్రకళా రూపాలను చిత్రించారు. భారతదేశ చిత్రకళా చరిత్రలో ప్రాంతీయ చిత్రరీతులు ఎంతో పేరు పొందాయి. చిత్రాలన్నింటినీ పరిశీలిస్తే వాటిలో ముఖ్యంగా రాచరిక వ్యవస్థకు సంబంధించిన విషయాలు తప్ప, సామాన్య మానవుడి నిత్య జీవితానికి సంబంధించిన అంశాలు కనిపించవు.

### రాజస్థాన్ చిత్రకళా సంప్రదాయం :

డా.ఎ.కె. కుమారస్వామి... భారతీయ లఘు చిత్రాలకు రాజపుత్, మొగలు, దక్కను సంప్రదాయ చిత్రకళా రీతులని పేరు పెట్టాడు. ఆ తర్వాత పరిశీలనలో మొగలు, దక్కను, పహాడీ, రాజస్థానీలుగా విభజన జరిగింది. కాగితంపై చిత్రించిన చిత్రాలు, ఆయా ప్రాంతాల భౌగోళిక వేషభాషలను ప్రతిబిం బిస్తూ.. రాజస్థాన్ కాలంలో లఘు చిత్రకళ అభివృద్ధి చెందింది. రాజస్థాన్ ప్రాంతంలో క్రీ.శ.16వ శతాబ్దం నుంచే చిత్రకళ ఉంది. రాజస్థాన్ చిత్రకళ ముఖ్యంగా ఆనాటి సంగీత సాహిత్యాలతో ప్రభావితమై చిత్రించడం జరిగింది.

రాజస్థానీ చిత్రాలలో సామాన్య ప్రజా జీవితం, మతం, కథా వస్తువులయ్యాయి. రామాయణ-మహాభారత ఘట్టాలను కృష్ణ లీలలు, నాయికా-నాయక లక్షణాలు- రాగ-రాగిణీ, బారా మాసా (పన్నెండు నెలలు) వంటి ప్రక్రియలు రాజస్థాన్ కళలో మనం చూడవచ్చు.

### పహాడీ చిత్రకళా శైలి :

ఈ శైలి క్రీ.పూ.16, 19 శతాబ్దాల మధ్య హిమాలయ పర్వత ప్రాంతాలలో అభివృద్ధి చెందింది. పంజాబ్‌లోని పర్వత ప్రాంతాలు,లోయలు, అరణ్యాలు, ప్రకృతి దృశ్యాలు, మనుషుల జీవన విధానాలు ఈ చిత్రకళలో మనకు దర్శనమిస్తాయి. ఈ చిత్రాలలో పశుపక్ష్యాదుల దృశ్యాలు చిత్రించారు. ఇందులో కథా వస్తువులు 'బారామాస చిత్రాలు' (పన్నెండు నెలలు), రాగ-రాగిణి చిత్రాలు (సంగీతాన్ని దృశ్యరూపంలో చిత్రించడం), రామాయణ, మహాభారత- భాగవతం, రసిక ప్రియ, గీత గోవిందం-హరిప్రియ, మీరాబాయి భజనలు, భక్తి సాహిత్యం ఈ చిత్రాలలో కనిపిస్తాయి. ఈ చిత్రాలలో చిత్రంపై గాని, కింద గాని పద్యాలు (దోహాలను)ను చిత్రించడం సంప్రదా యమైంది. చిత్రాలలో రంగుల మేళవింపు అత్యద్భుతంగా ఉంటుంది. పహాడీ చిత్రకళ భసోలీ, కాంగ్రా, గులేరు మొదలైన వివిధ ప్రాంతాల శైలీ విధానాలు కనిపిస్తాయి. పహాడీ చిత్రకళలో ప్రకృతి దృశ్యాలు, లోయలు, కొండలు, రుతువులు, రాధా- కృష్ణుల రాసలీలలు, రామాయణ-మహాభారత - భాగవత దృశ్యాలు భావయుక్తంగా చిత్రించడంలో ఈ కళ గొప్ప పేరు పొందింది.

### దక్కను చిత్రకళా సంప్రదాయం :

దక్కను ప్రాంతంలో క్రీ.శ. 17-18-19 శతాబ్దాలలో లఘు చిత్రకళ అభివృద్ధి చెందింది. దక్కను పీఠభూమి దృశ్యాలు, పశుపక్ష్యాదులు, మనుషుల జీవన విధానాలు, వేషభాషలు వివిధ రంగుల మేళవింపు తో చిత్రించడం దక్కను చిత్రకళా సంప్రదాయంలో ముఖ్యంగా చెప్పుకోవచ్చు. దక్కను చిత్రకళకు హైదరాబాద్, షోలాపూర్, బీదరు, అహమ్మద్ నగర్, గోల్కొండలలో వివిధ రీతులతో చిత్రించారు. హైదరాబాద్ సంస్థానంలో రాజా చందూలాల్ భారతీయ చిత్రకళను ప్రోత్సహించాడు. అదే విధంగా పిఠాపురం, పెద్దాపురం, గద్వాల్, వనపర్తి, విజయ నగరం సంస్థానాలలో సంస్థాన చిత్రకళని పేరుపెట్టి అభివృద్ధి చేశారు. ప్రకృతి దృశ్యాలు, మూర్తి చిత్రణలు, రాగ-రాగిణులు చిత్రాలను చిత్రించారు. కొన్ని సందర్భాలలో చిత్రాలను వస్త్రాలపై చిత్రించారు. 'గోల్కొండ కాటన్' పెయింటింగ్స్ ప్రపంచ ప్రఖ్యాతిగాంచాయి. కొన్ని సందర్భాలలో చర్మాలపై చిత్రించారు.

### గాజుపై చిత్రలేఖనం:

19వ శతాబ్దంలో గాజుపై చిత్రలేఖనం అభివృద్ధి చెందింది. ఈ కళ భారతదేశం అంతటా వ్యాపించింది. తంజావూరు, మైసూరు ప్రాంతాలలో గాజు చిత్రాలు రూపుదిద్దుకున్నాయి. ప్రారంభ దశలో సంస్థానాధీశుల ఆదరణతో అభివృద్ధి చెందింది. పూజా మందిరాలలో అలంకరించారు.

గాజు చిత్రకళలో రామాయణ - మహాభారత- భాగవతం లోని సంఘటనలు కథా వస్తువు. ఈ గాజు చిత్రలేఖనాలు (GLASS PAINTING) బెంగాల్, పుమక్కోటై, తిరుచురాపల్లి, మధురై, తంజావూరు, మైసూరు, కేరళ, ఆంధ్రాలో మచిలీ పట్నం, హైదరాబాద్, మహారాష్ట్ర ప్రాంతాలలో గొప్పగా అభివృద్ధి చెందాయి. కొయ్యపై కూడ చిత్ర లేఖనాలు తంజా వూరు, మైసూరు ప్రాంతాలలో అభివృద్ధి చెందాయి.

### కాన్వాసుపై చిత్రలేఖనం :

యూరప్ ఖండం-పాశ్చాత్య సంప్రదాయ చిత్రాల స్ఫూర్తితో 19వ శతాబ్దంలో కాన్వాసుపై చిత్రలేఖనం అభివృద్ధి చెందింది. రాజా రవి వర్మ, అవనీంద్రనాథ్ టాగూర్, నందలాల్ బోస్, క్షితీంద్రనాథ్

ముజుందారు వెంకటప్ప, రవీంద్రనాథ్ టాగూర్, హల్దార్ ముకుల్ చంద్ దేవ్, అమతా షేర్‌గిల్, హెచ్చార్, దేవీప్రసాదరామ్ చౌదరీ ఆంధ్రాలో దామెర్ల,అడాలిబాడి రాజు, మొక్కపాటి, గుర్రం మల్లయ్య, శ్రీనివాసులు-కొండపల్లి శేషగిరిరావు-ఎక్కా యాదగిరి రావు- ఫణి క్కర్ మొదలైన వారందరూ ఆధునిక చిత్రకళా సంప్రదాయాలలో చిత్రలేఖనాలు రూపుదిద్దారు. బెంగాల్, స్కూల్ బొంబాయి-మద్రాసు స్కూలు చిత్రకారులెందరో భారతీయ చిత్రకళ అభివృద్ధికి దోహదం చేశారు!!